# ఆశీర్వాద 'మస్త్'

- నాలుగు నియోజకవర్గాల్లో సభలు గ్రాండ్ సక్సెస్
- దేవరకద్ర, గద్వాల, మక్తల్, పేట సభలకు జనహోరు
- స్ఫూర్తినింపిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం
- జనం గుండెల నిండా గులాబీ జెండానే..
- రెట్టించిన ఉత్సాహంతో దూసుకెళ్తున్న కారు
- ప్రగతి ప్రదాత పర్యటనతో మరింత జోష్



దేవరకద్రలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో నృత్యం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రగతి ప్రధాత, గులాబీ బాస్ కేసీఆర్ సభలకు జనం సునామీలా పోటెత్తారు. సీఎం ప్రయాణిస్తున్న హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగా సభలకు సీఎం కేసీఆర్ కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ ఆయన రాక కోసం వేచి ఉండి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సీఎం కేసీఆర్ హెలికాప్టర్ సాంకేతిక లోపం తలెత్తినా మనందరిపై ఉన్న ప్రేమతో చావును కూడా లెక్క చేయకుండా వచ్చారని ఉద్వేగ భరితంగా సభలో వెల్లడించారు. సోమవారం ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన దేవరకద్ర ప్రజా ఆశీర్వాద సభకు జనం ఉదయం 8గంటల నుంచే వచ్చారు. గద్వాలలో ఉదయం 10నుంచి, మక్తల్‌లో మధ్యాహ్నం 12గంటల నుంచి, నారాయణపేటలో ఒంటిగంటకే సభకు తరలివచ్చారు. మధ్యాహ్నానికే నాలుగు సభలు జనంతో కిక్కిరిసిపోయాయి. దీంతో వచ్చి రాగానే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో తన ఆలస్యానికి గల కారణాలను వివరిస్తూ మరోసారి మీ నియోజకవర్గాలకు వస్తానని, ఇక్కడే ఒక రోజు పాటు గడుపుతానని హామీ ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అడిగిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు పచ్చ జెండా ఊపారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం ఏర్పడిన నెలలోనే పూర్తి చేస్తానని జనాలకు హామీ ఇవ్వడంతో కేరింతలు కొట్టారు. మరోవైపు ఒకేరోజు నాలుగు ప్రజా ఆశీర్వాద సభలు ఏర్పాటు చేస్తే జనం ఎలా వస్తారని, సమావేశాలు అట్టర్‌ప్లాప్ అవుతాయని విపక్షాలు పెదవి విరిచాయి. విపక్షాల విమర్శలకు గట్టి సమాధానం చెబుతూ నాలుగు సభలు జనం సునామీని తలపించాయి. అసాధ్యం అనుకున్న ప్రజా ఆశీర్వాద సభలు ఊహించని రీతిలో విజయవంతం కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థులు ఆనందంలో ఉండగా, ప్రతిపక్షాలు చేసేది లేక నిట్టూరుస్తున్నాయి. ఓటు చాలా విలువైందని, ఆలోచించి పనిచేసే వారికి పట్టం కట్టాలని సీఎం పిలుపునివ్వడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తున్నది. సభ నాలుగు చోట్ల విజయవంతం కావడంతో ఈనెల 19వ తేదీన కేసీఆర్ అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలకు రానున్నారు. ఈ మేరకు కేసీఆర్ టూర్ షెడ్యూల్ ఖరారైంది. అలాగే 22న మహబూబ్‌నగర్ పట్టణంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతారు. మరోవైపు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 24వ తేదీన అచ్చంపేట, మక్తల్‌లో జరిగే రోడ్ షో, బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. త్వరలో మంత్రి హరీశ్‌రావు టూర్ కూడా ఉండబోతుందని పార్టీ శ్రేణులు ప్రకటించాయి.

**సభలకు పోటెత్తిన జనం..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలు ఊహించని రీతిలో విజయవంతమయ్యాయి. ఒకేరోజు నాలుగు సభలకు జనం రారని విపక్షాలు ఎద్దేవా చేసినా వారి దిమ్మతిరిగేలా సునామీలా తరలివచ్చారు. అంతేకాక సీఎం కేసీఆర్ కోసం 5గంటల పాటు నిరీక్షించడం మరో ఎత్తు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, పార్టీ మేనిఫెస్టో ప్లకార్డులను ప్రదర్శించి సభలకు ఫుల్ జోష్‌తో తరలివచ్చారు. చాలాచోట్ల జనం గిరిజన వేషాధారణలు, డప్పు వాయిద్యాలు మేళతాళాలతో గులాబీ జెండాను పట్టుకుని సభకు తండోపతండాలుగా తరలివచ్చారు. కళాకారులు ఆలపించిన పాటలకు జనం ఊగిపోయారు. జై తెలంగాణ, జై కేసీఆర్ మరోసారి బీఆర్ఎస్ సర్కార్ హ్యాట్రిక్ అంటూ నినాదాలు చేశారు. దేవరకద్రలో గాయని మధుప్రియ పాడిన పాటలకు మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి డాన్స్ చేశారు. మక్తల్‌లో మానుకోట ప్రసాద్ పాడిన పాటకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కార్యకర్తలతో కలిసి చిందులు వేశారు. నారాయణపేట, గద్వాలలో కూడా ప్రజలు ఆట పాటలకు ఉర్రూతలూగారు.

**గులాబీదళంలో ఫుల్ జోష్..**

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని పార్టీలకు ముందుగానే ప్రచారంలో దూసుకుపోతున్న గులాబీదళం ప్రజా ఆశీర్వాద సభలు సక్సెస్ కావడంతో ఫుల్‌జోష్ కనిపిస్తున్నది. సభావేదిక నిండిపోవడంతో చాలామంది బయటనే ఉండిపోయారు. నామినేషన్ల ఘట్టం చివరి అంకానికి రావడం, ఎన్నికలకు ఇంకా 23 రోజుల సమయమే ఉండడంతో సీఎం కేసీఆర్ సభల విజయవంతంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం మరింత నెలకొంది. ఇదే ఉత్సాహంతో గ్రామాల్లో గడపగడపకు ప్రచారం చేయాలని పార్టీ అభ్యర్థులు దిశా నిర్దేశం చేస్తున్నారు.

**నవంబర్ 19, 22 తేదీల్లో గులాబీ బాస్ రాక..**

అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ అన్ని నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలను ఏర్పాటు చేస్తున్నది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 12 నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాల్లో సభలు సక్సెస్ అయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే అక్టోబర్ 18వ తేదీన జడ్చర్లలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. 26వ తేదీన అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లో, నవంబర్ 6వ తేదీన ఏకంగా నాలుగు నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు చేపట్టారు. ఈనెల 19వ తేదీన అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో, 22వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. మొత్తం 12నియోజకవర్గాల్లో గులాబీ బాస్ ప్రచార సభలు పూర్తవుతాయి. దీంతోపాటు ఈనెల 24న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అచ్చంపేట, మక్తల్ నియోజకవర్గాల్లో రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొననుండగా, మంత్రి హరీశ్‌రావు ఉమ్మడి జిల్లాలో రోడ్‌షోలో, బహిరంగ సభల్లో పాల్గొంటారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో క్లీన్ స్వీప్ లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతోంది.

# రాత్రి కరెంటుకు రైతుల బలి

- పెద్ద దిక్కును కోల్పోయిన రోడ్డున పడిందెందరో..
- నేటికీ తేరుకోకుండా అల్లాడుతున్నది బాధితులు
- తెలంగాణ వచ్చాక నిరంతర కరెంట్‌తో తీరిన కష్టాలు
- కాంగ్రెస్‌ను నమ్మితే కరెంట్ కష్టాలు తప్పవంటున్న రైతులు

వనపర్తి, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : సమైక్య పాలనలో అత్యధికంగా కరెంట్ మోటర్లతో సేద్యం చేసే జిల్లాగా వనపర్తి పేరు తెచ్చుకున్నది. ఆంధ్రా ముఖ్యమంత్రులు పాలించినంత కాలం ఈ ప్రాంతాన్ని ఎడారి చేసి ఇక్కడి భూముల్లో పల్లేర్లు మొలపించిన చరిత్ర వారిది. ఎలాంటి ప్రాజెక్టుల నీటి వసతిని కల్పించకుండా కేవలం బోరు.. బావుల ఆధారంగానే సేద్యాన్ని నడిపించిన నాటి పాలకులు అదే కరెంట్ షాక్‌లకు వందలాది మంది అన్నదాతలను ఉసురుపోయేలా చేశారు. గంటల వ్యవధిలో సరఫరా చేసే కరెంట్‌తో రాత్రి.. పగలు ఎదురు చూపులతో అన్నదాతలు నిద్రలేని రాత్రులను గడిపారు. ఈ పరిస్థితిలో తెలంగాణ ఏర్పాటుకు ఓ ఐదేండ్ల ముందు కాంగ్రెస్ పాలనలో జిల్లాలో కరెంట్ షాక్‌లకు గురై చనిపోయిన అన్నదాతల కుటుంబాలు అనేకం. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 99 మంది రైతులు అసువులు బాసారు. 2008లో 16 మంది, 2009లో 14 మంది, 2010లో 15 మంది, 2011లో 27 మంది, 2012లో 15 మంది, 2013లో 12 మంది రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. కరెంట్ సక్రమంగా రాకపోతుండడంతో వచ్చిన సమయంలోనే బోర్లు వేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. రెండు విడుతలు కరెంటు ఇస్తున్నామని చెప్పినా అది ఎప్పుడు వచ్చుడో.. ఎప్పుడు పోవుడో అన్న చందాన వ్యవసాయం ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. ప్రస్తుతం జిల్లాలో మొత్తం వ్యవసాయానికి సంబంధించి 2,54,188 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

## పగలే మా ఇంటాయన ప్రాణాలు హరీ..



సమైక్య పాలనలో పట్ట పగలే కరంట్ షాక్‌లకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నారు. మాది గోపాల్‌పేట మండలం లక్ష్మీ తండా. మాకు మూడెకరాల పొలం ఉంది. బోరు కింద పంటలేసేటోళ్లం.. ఉండగా.. నా భర్త భద్రునాయక్ పొలం దగ్గరకు వెళ్లి పగలే కరెంట్ షాక్‌కు గురై 2013లో చనిపోయాడు. ఆ సమయంలో నేను కూడా వెంట ఉండడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నా.. మాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తర్వాత పంటలు పండుడు కష్టమని భావించి కాడెద్దులతోపాటు ఉన్న పశువులను అమ్ముకొని బతుకు వెల్లదీశాను. కానీ తెలంగాణ వచ్చినంక కరెంటు బాగుంది.. ఎప్పుడంటే అప్పుడే బోర్లు వేసుకోవచ్చు. తెలంగాణ రాకముందు నా భర్త సచ్చిపోయిండు. కేసీఆర్ వచ్చినంక నాకు పింఛన్ వస్తుంది. రెండు వేలతో బతుకు నడుస్తుంది. ఇయ్యాలా కరెంట్‌తో పని లేకుండా కాలువల్ల నీళ్లొచ్చినయి.. ఇట్లా ఉంటే, నా భర్త కూడా చనిపోయేవాడు కాదు. కాడి కిందేసినం.. పిల్లలు తలోదారిలో బతుకుతున్నరు. కరెంట్ షాక్‌తో భర్త సచ్చిపోవడంతో మా పరిస్థితి మారిపోయింది. తెలంగాణ రాకుంటే.. కేసీఆర్ లేకుంటే.. ఇంకా కష్టమే ఉంటుండే..

**- లక్ష్మి, లక్ష్మీతండా, గోపాల్ పేట మండలం, వనపర్తి జిల్లా**

## రాత్రి కరెంట్‌తోనే.. నా తండ్రి మృతి



మాది ఉమ్మడి కుటుంబం.. నా తండ్రి చిన్న బాలయ్య సేద్యం పనులను చేసేటోడు. నలుగురు అన్నదమ్ములుంటే, నా తండ్రే ఎక్కువగా పంటలు పండించేటోడు.. మొత్తం 14 ఎకరాలు ఉండేది. గ్రామ సమీపంలోని చెరువు కిందే పొలం ఉండేది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరువు, కాటకాలు ఉండేవి. కాల్వలకు నీళుల అసలే ఉండేవికావు. కేవలం బోర్లపై ఆధారపడి సేద్యం చేసేటోళ్లు.. కరెంట్ ఎప్పుడు వస్తే అప్పుడే బోరు మోటర్ ఆన్‌చేయాలి. లేకుండా నీళ్లు అందక పంటలు ఎండిపోయేవి. దీంతో కరెంట్ ఎప్పుడొస్తే అప్పుడే పొలం వద్దకు వెళ్లి బోర్లు వేసేటోళ్లు.. అయితే నా తండ్రి కూడా బోరు వేసేందుకు పొలం వద్దకు వెళ్లి నీళ్లు పెట్టే సమయంలో విద్యుత్ వైర్ కనిపించకపోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మరుసటి రోజు పసుల కాపర్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాం.. గ్రామ పెద్దలు కొంత ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. నా తండ్రికి ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. తెలంగాణ వచ్చాక మా చెరువుకు నీటి కరువు లేదు. మంత్రి నిరంజన్‌రెడ్డి బుద్ధారం బ్రాంచి కెనాల్ ద్వారా సాగునీరు పారిచ్చిండు. మాకు ఇప్పుడు బోర్లతో పనే లేదు. చెరువు నీళ్లే మా పొలాలకు సమృద్ధిగా పారుతున్నాయి. ఆంధ్రా పాలనలో కరెంట్ కష్టాలతో మానాన్న చనిపోవడం మాకు తీరని బాధను మిగిల్చింది.

**- చిన్న బాలయ్య కొడుకు శ్రీధర్, జగత్‌పల్లి, పెద్దమందడి, వనపర్తి జిల్లా**

# కాంగ్రెస్ పాలనలో ధర్నాలే..

గద్వాల, నవంబర్ 7 : కాంగ్రెస్ కరెంట్ కోసం నిత్యం రోడ్లపై రైతులు ధర్నాలు చేసేటోళ్లు.. చివరకు నీరందక పొలాలన్నీ ఎండిపోయేవి. పెట్టుబడి కూడా అందక రైతు అప్పుల పాలయ్యేటోడు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే కరెంట్ తీగలపై బట్టలు ఆరబెట్టుకోవాలని సీమాంధ్ర పాలకులు ఎగతాళి చేసిన మాటలు ఇంకా రాష్ట్ర ప్రజల చెవుల్లో గింగిరుమంటున్నాయి. వీటిని పటాపంచలు చేస్తూ తెలంగాణ ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌ను సరఫరా అందించారు. దీంతో నాటి కష్టాలు రైతుకు మరెన్నడూ రాలేదు. కరెంట్ నిరంతరం ఉండడంతో ఎప్పుడైనా పొలాల వద్దకు వెళ్లి బోర్లను ఆన్ చేసి నీటిని పంటచేళ్లకు పారిస్తున్నారు. సీఎం కేసీఆర్ రైతుబాంధవుడిలా కర్షకులకు వెన్నుదన్నుగా నిలిచారు. నిరంతరం కరెంట్ వెలుగులతో రైతన్న సంబురంగా సాగు చేపట్టాడు.

## గతంలో కరెంట్ గిట్ల ఎప్పుడూ లేదు



గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియని పరిస్థితి. మాది వ్యవసాయ కుటుంబం నాకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. మాకు మూడు ఎకరాలు పొలం ఉండేది. 2004 సంవత్సరంలో నా చిన్న కొడుకు మహేశ్ పంట పొలానికి నీరు పెట్టడానికి వెళ్లిన సమయంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంట్ కష్టాలు ఎదుర్కొనేవారు. కరెంట్ ఉన్నా లో వోల్టేజీ సమస్యతో విద్యుత్ మోటర్లు నడిచేవి కావు. ఏడాదిలో నాలుగైదు సార్లు మోటర్లు కాలిపోయేవి. కరెంటు కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసిన సంఘటనలు గతంలో కోకొల్లలు.. లోవోల్టేజీ సమస్యతో ఏడాదిలో నాలుగు సార్లకుపైగానే విద్యుత్ మోటర్ల కాలిపోయేవి. అడిగితే కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు రైతులను కొట్టించిన సంఘటనలు ఉన్నాయి. రాత్రివేళ పొలాలకు నీరు పెట్టడానికి వెళ్లి ఎందరో షాక్‌కు గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కరెంట్ కోసం నిత్యం రోడ్లపై ధర్నాలు చేసేటోళ్లు.. తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. దీంతో రైతులు వారి పొలాల వద్దకు ఎప్పుడైనా వెళ్లి నీరు పారించుకునే అవకాశం ఏర్పడింది. గతంలో ఏ ప్రభుత్వం రైతుల కోసం కరెంట్ గిట్ల ఇవ్వలే. ప్రస్తుతం రైతులకు ప్రభుత్వం నాణ్యమైన కరెంట్ ఇస్తుండడంతో తెలంగాణలో రైతుల విద్యుత్ మరణాలు తగ్గాయి. మోటర్లు కాలిపోవడం లేదు. మేము మోటర్ వేసి ఐదేండ్లు కావస్తున్న ఇప్పటి వరకు ఎటువంటి రిపేరు కాలేదు. అందుకు కారణం లోవోల్టేజీ లేకుండా సరఫరా అందుతుండడమే.. రైతులకు అవసరమైనా త్రీఫేజ్ కరెంట్ ఇవ్వడమే కారణం. రైతుల కోసం గిట్ల పాటుపడిన ముఖ్యమంత్రులు ఎవరూ లేరు.. కేసీఆర్ ఒక్కరే. రైతుల విద్యుత్ మరణాలు తగ్గాయి.. రాత్రి వేళల్లో వారి కుటుంబంతో కలిసి హాయిగా నిద్రపోతున్నారు.

**- జార్జన్న, రైతు, జమ్మిచేడ్, జోగుళాంబ గద్వాల జిల్లా**